## రేపు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కొల్చారం మండలంలో పర్యటన

**-తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు**

**కొల్చారం, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** ఈ నెల 13వ తేదీన మంగళవారం కొల్చారం మండలంలో నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు వివరాలను వెల్లడించారు. మండల కేంద్రమైన కొల్చారంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.00 గంటలకు 39 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఏడుపాయల వనదుర్గ భవాని మాత గుడి వరకు రోడ్డు నిర్మాణం కొరకు పోతంశెట్టిపల్లి, చిన్నఘనపూర్ గ్రామాల భూ సంబంధిత పట్టాదారులకు నష్టపరిహారం కింద చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## 'మంజీరా'లో మునిగి యువకుడి మృతి

**పాపన్నపేట, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** ఏడుపాయల మంజీరా చెక్‌డ్యాంలో ప్రమాదావశాస్తు మునిగి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం...సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మర్వెల్లి గ్రామానికి చెందిన చాకలి మొగులయ్య (35) ఓ విందులో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం ఏడుపాయలకు వెళ్లాడు. ఆదివారం ఉదయం మంజీరా చెక్ డ్యాంలో స్నానం చేసేందుకు చెక్‌డ్యాంలోకి వెళ్లగా ప్రమాదావశాస్తు జారిపడి నీటిలో మునిగిపోయాడన్నారు. మృతుడు చాకలి మొగులయ్య ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్లతో చెక్‌డ్యాంలో వెతుకగా మొగులయ్య మృతదేహం లభ్యమయిందన్నారు. పాపన్నపేట పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి మెదక్ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు.



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పుర్ర ప్రభాకర్

## రంగంపేట మండల సాధనకై పుర్ర ప్రభాకర్ ఆమరణ నిరాహార దీక్ష

**కొల్చారం, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** రంగంపేటను మండల కేంద్రంగా ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్ మాదిగ ఆదివారం ఆమరణ నిరాహారదీక్షకు కూర్చుకున్నారు. మండల పరిధిలోని రంగంపేటలోని బస్టాండ్ వద్ద డా.బి.ఆర్. అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలకు పూలమాలలువేసి మండల సాధనకు ఆమరణ నిరాహార దీక్షకు మెదక్-సంగారెడ్డి పక్కన బస్టాండ్ ఆవరణలో కూర్చుకున్నారు. ఈ దీక్షలో పుర్ర మహేష్, పెద్దలింగన్నగారి కిష్టయ్య, సీహెచ్. ముర్షిత్, ఎస్. యేసు, పి. రాజు, జీ. బాల్‌రాజు, సీహెచ్. యాదయ్య, ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రోల సంజీవ్, ఏనగండ్ల ఉప సర్పంచి ఉషన్నగారి బాబు, కొల్ల రవి, పి. మధు, బి. పద్మయ్య, సీహెచ్. సన్నీ, బి. దేవయ్య, పాపయ్య, జాన్, అనంతి బంగారయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ ఛాంపియన్‌షిప్ కరాటేలో సత్తాచాటిన మెదక్ జిల్లా విద్యార్థులు

**-బంగారు, కాంస్య పతకాలు కైవసం**



సాధించిన పతకాలతో విద్యార్థులు

**మెదక్ అర్బన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** నేషనల్ ఛాంపియన్ షిప్ కరాటే పోటీల్లో మెదక్ పట్టణానికి చెందిన విద్యార్థులు సత్తా చాటి ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకున్నారు. ఆదివారం మేడ్చల్‌లోని సుమంగళి కన్వేషన్ హాల్‌లో కీయో జపాన్ షోటోకాన్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఛాంపియన్ షిప్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 60 కేజీల స్పారింగ్‌లో మెదక్ పట్టణానికి చెందిన విద్యార్థులు పవార్ విజయ ప్రసాద్, 30 కేజీల స్పారింగ్‌లో శ్రీహర్షిణి బంగారు, 30 కేజీల స్పారింగ్‌లో సాయి కారుణ్య, హారిణజ, విద్యాధర్, లక్ష్మీనర్సింహా కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. సత్తా చాటిన విద్యార్థులను మూన్ బుడోకాన్ కరాటే వ్యవస్థాపకులు, సీనియర్ మాస్టర్ కరాటే శేఖర్, శిక్షకులు సుభాష్ అభినందించారు.

## రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీని బలోపేతం చేద్దాం

**టిపిసిసి నూతన ప్రధాన కార్యదర్శి హరికృష్ణ**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



టిపిసిసి ప్రధాన కార్యదర్శి హరికృష్ణను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి సైనికుల్లా పని చేస్తానని అ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేట పట్టణానికి చెందిన పూజల హరికృష్ణ టిపిసిసి నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం పార్టీ శ్రేణులు అయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ పార్టీలో కష్టపడే పని చేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ముందుకు సాగుదామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అందరం కలిసి పోరాటం చేద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పూజల గోపికృష్ణను పార్టీ శ్రేణులు సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు కలిమొద్దీన్, కనకయ్య, వాహబ్, అజ్మత్, మున్నా, శ్రీనివాస్, రమేష్, బాలు, సలీమ్, అర్జున్, శ్రీను, రవి, శివ, పవన్, ప్రతాప్ పాల్గొన్నారు.

## రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**తొగుట, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** అల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను దుబ్బాక నియోజకవర్గం తొగుట మండల గుడికందుల మాజీ సర్పంచ్ హనుమండకడి కిష్టారెడ్డి ఆదివారం ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంకు సంబంధించిన పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు కిష్టారెడ్డి తెలిపారు. దేశంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఖర్గే సూచించినట్లు వివరించారు.



ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షులు ఖర్గేను కలిసిన హనుమండకడి కిష్టారెడ్డి

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేశాం

**మెదక్ జిల్లా కలెక్టర్ హరీష్**

**మెదక్ అర్బన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వానాకాలంలో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసి అందుకనుగుణంగా ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాలు, ఐకేపీ, మార్కెట్ కమిటీ, రైతు ఉత్పత్తి సంఘాల ఆధ్వర్యంలో 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఈ కేంద్రాల ద్వారా 81,500 మంది రైతుల నుండి 806 కోట్ల రూపాయల విలువ గల 3 లక్షల 90 వేల 500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. 90 శాతం ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేసి 72,979 మంది రైతులకు 670 కోట్ల రూపాయల డబ్బును వారి ఖాతాల్లో జమచేశామని ఆయన తెలిపారు.

మిగతా రైతులకు త్వరలో డబ్బులు వారి ఖాతాల్లో వేస్తామని వివరించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల తరువాత అత్యధికంగా ధాన్యం సేకరణ మన మెదక్ జిల్లాలోనే జరిగిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం, సమిష్టి కృషివల్ల గత అక్టోబర్ 26న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి శరవేగంతో ధాన్యం కొనుగోలు చేసి శనివారం నాటికి నిజాంపేటలో చివరి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లుచేసి ప్రక్రియ పూర్తి చేశామన్నారు. కేవలం 40 రోజుల్లోనే 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వ్యాపారస్తులు రైతుల నుండి నేరుగా కొనుగోలు చేశారని కలెక్టర్ తెలిపారు.

రైతులకు సకాలంలో డబ్బులు అందజేశామని, రబీ పంటకు సంబంధించి త్వరగా వరినార్లు విత్తితే ఏప్రిల్ నాటికి పంట దిగుబడి వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణలో సహకరించిన రైస్ మిల్లుల యాజమాన్యానికి, కేంద్రం నిర్వాహకులకు, ప్రతి ఒక్కరికీ కలెక్టర్ హరీష్ ధన్యవాదాలు తెలిపారు.

# దేశ రాజకీయాల్లో చక్రం తిప్పడమే బిఆర్ఎస్ లక్ష్యం

**ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి**

**తొగుట, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**

తెలంగాణ తరహా దేశాన్ని అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమం దిశగా ముందుకు తీసుకెళ్లడానికే సిఎం కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో అడుగు పెట్టడం జరిగిందని మెదక్ ఎంపి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తొగుటలో అదివారం ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి బిఆర్ఎస్ పార్టీ జెండాను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ నాడు తెలంగాణ కోసం సబ్బండ వర్గాలను ఒక్కతాటిపైకి తెచ్చి సాకారం చేసుకున్నామని..దేశ రాజకీయాల్లో సిఎం కెసిఆర్ నాయకత్వంలో చరిత్ర సృష్టించడం ఖాయమన్నారు. స్వరాష్ట్రం కోసం తన ప్రాణాన్ని ఫణంగా పెట్టిన కెసిఆర్ తెలంగాణ సాధించిన వ్యక్తిగా ప్రజల ఆశీస్సులతో సిఎంగా బాధ్యతలు చేపట్టి అనతి కాలంలోనే తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపారన్నారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో రాబోయే రోజుల్లో దేశంలో మార్పు రావడం ఖాయమన్నారు. తొగుటలో కనకలక్ష్మి, ఫక్రోద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రీజర్‌లను ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం అల్వాల బ్రిడ్జి పనుల కోసం సహకారం అందించిన బాసిరెడ్డి పద్మజ భాస్కర్‌రెడ్డిలను మండల ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపి, ఎమ్మెల్సీలు సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు రాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కొమురయ్య, రాంరెడ్డి, కనకయ్య, గోవర్ధన్‌రెడ్డి, నర్సింలు, యాదగిరి, ఎండి. కలీమొద్దీన్, స్వామి, శరత్, మల్లయ్య, ఎల్లం, నర్సింలు, శ్రీనివాస్, మల్లారెడ్డి, కనకయ్య, రఘోత్తంరెడ్డి, రమేష్, చంద్రారెడ్డి, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి శ్రీశైలం, కనకయ్య, అనిల్, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి, కర్ణాకర్, గణేష్, మహేష్, అంజనేయులు, ప్రవీణ్, రాంబాబు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ జెండాను అవిష్కరిస్తున్న ఎంపి, ఎమ్మెల్సీ

# దుర్గంధభరితం 'కుకునూరుపల్లి'

**ఇళ్లల్లోకి పారుతున్న మురుగునీరు**

**పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**

**కొండపాక, డిసెంబర్ 11, ప్రభాతవార్త**

పల్లెప్రగతి కార్యక్రమంలో గ్రామాలకు నిధులు మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం నిర్వహించి గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చలనే ఉద్దేశంతో ముందుకు సాగుతుంది. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఆలోచనకు వ్యతిరేకంగా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో గ్రామాలు అభివృద్ధి పథంలో నడవకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కుకునూరుపల్లి గ్రామంలో మురికి కాలువలు సక్రమంగా లేక మురికి నీరు ఇండ్లల్లోకి పారుతుందని, కొన్నిచోట్ల మురికికాలువలు నిండినా నెలలతరబడి చెత్త తీయక పోవడంతో దుర్వాసన వస్తుందని కార్యదర్శికి, గ్రామ సర్పంచ్ పొల్కంపల్లి జయంతి నరేందర్‌కు ఎన్ని సార్లు చెపినా పట్టించుకోవడంలేదని మా గ్రామం పరిస్థితి పైన పటారం లోపల లోటరంలా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల మురికి కాలువలు కూలిపోయి చెత్తచెదారం చేరి మురికి నీరు రోడ్లపై వచ్చి అ ప్రాంతం నుండి వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు తెలిపారు. బిసి కాలనీలో మురికి నీరు బయటకు పంపలేక వాటర్ ట్యాంక్ వద్ద మూడు ఇంకుడు గుంతలు తీసి వాటిపై మూతలువేయకపోవడంతో అక్కడ ఈగలు, దోమలు, పాములు చేరడంతో ప్రతిరోజు భయపడుతు బ్రతకాల్సి వస్తుందని కాలనీ వాసులు తెలిపారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించక పోవడంతో అక్కడ నిత్యం పాములు తిరుగుతున్నయన్నారు. పిచ్చిమొక్కలను తొలగించక ఇంకుడు గుంతలపై మూతలు వేయకపోవడంతో ప్రజలు వివిధ రకాల వ్యాధుల భారిన పడుతున్నామని అవేదన వ్యక్తం చేశారు. మురికి కాలువల నిర్మాణనికి గడ నిధుల ద్వారా రూ. 90 లక్షలు మంజూరైనా పనులు చేపట్టడంలో అధికారులు, సర్పంచ్ పట్టింపులేకుండా వ్యవహరిస్తుండడంతో కాలనీ వాసులు వాపోతున్నారు.



మురికి కాలువలో చెత్త చెదారం నిలువఉన్న దృశ్యం



వనదుర్గా భవాని మాతకు హారతి అందిస్తున్న అర్చకుడు, అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

## దుర్గమ్మ సన్నిదిలో భక్తులు సందడి

**పాపన్నపేట, డిసెంబరు 11, ప్రభాతవార్త:** అమ్మలగన్న అమ్మ మాయమ్మ ఏడుపాలయ వనదుర్గమ్మ అంటూ భక్తులు అమ్మవారిని స్మరిస్తూ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవురోజు కావడంతో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా చెక్ డ్యాంలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు సమర్పణ, ఒడి బియ్యం నింపడం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటి ఛైర్మన్ బాలాగౌడ్, ఆలయ ఇఓ సార శ్రీనివాస్‌లు ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులతో కలిసి తగు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో అర్చకులు శంకర్‌శర్మ, పార్థివ శర్మ, మురళిశర్మ, రాము శర్మ, రాజశేఖర్ శర్మ, నాగరాజు శర్మ వేద మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

# రైతువేదికల నిర్వహణ ఖర్చులు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

**సంగారెడ్డి మున్సిపాలిటి డిసెంబరు 11,ప్రభాతవార్త:**

రైతువేదికల నిర్వహణలో ఎఇఒలు ఎదుర్కొంటున్న ఆర్థికఇబ్బందులు తొలిగించేందుకు ప్రభుత్వం ఊరట నిచ్చే అదేశాలను జారీ చేసింది. జిల్లాలో నిర్మించిన రైతు వేదికల నిర్వాహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొత్తం 116 రైతు వేదికలు ఉన్నాయి. వీటి నిర్వహణకు గతంలో ఇచ్చిన రూ. 4 వేలకు అదనంగా ఐదువేలు పెంచి, మొత్తం నెలకు రూ. 9 వేల కేటాయిస్తు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఆగస్టు వరకు సంబంధించి నిధులు ఉన్నాయి. ఇప్పటివరకు రైతువేదికల నిర్వహణకు నిధులు కొరతతో ఇబ్బంది పడ్డ ఏఇఒలకు ఇప్పుడు ఆ ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. నిర్వహణ ఖర్చులు విడుదల చేసిన ప్రభుత్వం వాటిని వినియోగించే విధివిధానాలను సూచించింది. ఒక నెలలో విద్యుత్ బిల్లుకు వెయ్యి, తాగు నీటికి రూ. 500, వాచ్ అండ్ వార్డ్‌కు మూడువేలు, స్టేషనరికి వెయ్యి, శిక్షణ సమావేశాలకు రెండువేల ఐదువందలు, ఇతర ఖర్చులకు వెయ్యి రూపాయలు ఖర్చు చేసుకోవాలని పేర్కొంది. రైతువేదికల నిర్వహణకు మంజూరైన నిధులు జెడీఖాతా నుంచి ఏడీల ఖాతాల్లోకి బదిలిచేసినట్లు అధికారులు పేర్కొన్నారు. వెచ్చించిన ప్రతి ఖర్చులకు, బిల్లులు పక్కగా ఉండాలని నిబంధన పెట్టింది. ఇందుకు సంబంధించిన ఫార్మాట్లను రుపొందించి అధికారులకు పంపింది. ఏడీ ఖాతాల్లో ఉన్న నిధులను పొందడానికి రెండంచెల వ్యవస్థను ఏర్పాటుచేసింది. చేసిన ఖర్చుకు డబ్బులు డ్రా చేయాలంటే, ఏఇఒలు మండల వ్యవసాయాధికారితో బిల్లులపై అటెస్టేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అనంతరం సంబంధిత బిల్లులు పత్రాలను ఏడీకి సమర్పించాలి.ఏడీ పరిశీలన అనంతరం ఎఇఓ ఖాతాలో డబ్బులు జమఅవుతాయి. ఆదేవిధంగా ప్రభుత్వం మంజూరుచేసిన నిధుల్లోంచి ఏఇఒలు గత ఏప్రిల్ నుండి ఆగస్టువరకు చేసిన విద్యుత్, వాటర్, స్టేషనరీ బిల్లులు డ్రాచేసుకునే వీలుందని సంబంధిత శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు.




హత్నూరలో నూతనంగా నిర్మించిన రైతువేదిక

నిధుల వినియో గంలో ప్రభుత్వం జారీ చేసిన, నిబంధనలు అతిక్ర మించి నిధులు దుర్వినియోగం చేస్తే కఠినచర్యలు తప్పవని వారు పెర్కొంటున్నారు. ఈ విషయమై సంగారెడ్డి జిల్లా డిఏఓ నర్సింగ్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని 116 రైతువేదికల నిర్వహణకు సంబం ధించి పెంచిన నిధులు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో ఆదనంగా ఏఇఓ పోస్టులు ఆవసరం ఉన్నం దున, 42 ఏఇఓ పోస్టుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు డిఏఓ తెలిపారు.

## నేడు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవన నిర్మాణానికి మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**

అభాగ్యులైన ఒంటరి మహిళలకు మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేటలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటు కానుంది. రూ.4 కోట్లతో సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ ప్రాంతంలో నిరి ్మంత తలపెట్టిన శాశ్వత భవనానికి ఈనెల 12న మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ మహిళలకు ఎంతో భరోసాగా నిలుస్తుందని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. భర్త లేని భర్త వదిలి వెళ్ళిన పిల్లలతో పాటు ఒంటరిగా ఉండే మహిళలకు ఉమెన్స్ హాస్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శాశ్వత భవనాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు.

### రూ.15 కోట్లతో 50 పడకల అయూష్ అసుపత్రి

మంత్రి హరీష్‌రావు ప్రత్యేక కృషితో సిద్దిపేటలో రూ.15 కోట్లతో 50 పడకల అయూష్ అసుపత్రి ఏర్పాటు చేయనున్నారు. సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంతంలో 30 గుంటల స్థలంలో అయూష్ అసుపత్రిని భవనాన్ని నిర్మించనున్నారు.ఈ నెల 12న భవన నిర్మాణానికి మంత్రి చేతుల మీదుగా శంకుస్థాన చేయనున్నారు. అయుర్వేదం, యోగ, నాచురోపతి, యునాని, సిద్ధ, హోమియో ఇందులో దేని ప్రత్యేకత దానిదే ఈ అసుపత్రిలో ఒకే చోట ఏర్పాటు కానుంది.అయూష్ అసుపత్రి ద్వారా భవిష్యత్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల అసుపత్రిలో చికిత్స పొంది పూర్తి స్థాయిలో ఫిజియో థెరపి లాంటివి చేస్తూ సంపూర్ణ అరోగ్యం పొందేందుకు వైద్య కళాశాల అసుప త్రి అందుబాటులే ఉండే విధంగా అయూష్ అసుపత్రిని వైద్య కళాశాల అసుపత్రి వద్ద నిర్మించనున్నారు.

## భక్తులతో కిటకిటలాడిన మల్లన్న అలయం



కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

**కొమురవెల్లి, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**

ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి అలయానికి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అదివారం సెలవు దినం కావడంతో భక్తులు తమ పిల్లాపాపలతో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే భక్తులు స్వామి వారికి అభిషేకం, నిత్యకళ్యాణోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తి శ్రద్దలతో బోనం సమర్పించారు. రాతిగీరల వద్ద ప్రదక్షణలు, కోడెల స్తంబం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అలయ అధికారులు, పాలక మండలి తగు ఏర్పాట్లు చేశారు.

## శివ్వంపేట మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

**శివ్వంపేట, డిసెంబర్11 ప్రభాతవార్త:**

శివ్వంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు బిజీ బిజీగా పర్యటించారు. మండల పరిధిలోని గోమారం గ్రామంలో సాయిరోహిత్‌గౌడ్ స్వామి నివాసంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా చిన్నగొట్టిముక్కల గ్రామంలో ముత్యాలరావు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. శివ్వంపేట మండల కేంద్రంలోని 8, 9, 10వ వార్డులకు నీటి సమస్య ఉందని తెలుసుకున్న స్థానిక జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త తన స్వంత నిధులతో నీటి బోరు త్రవ్వకం పనులు ప్రారంభించడం జరిగింది. దీంతో వార్డు సభ్యులు, స్థానికులు మహేష్‌గుప్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా చెన్నాపూర్ గ్రామానికి చెందిన మన్నె కృష్ణ తన చిన్నారులకు సికింద్లాపూర్ దేవస్థానం వద్ద పుట్టుపంచెల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహేష్‌గుప్త చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు పి. సుధీర్‌రెడ్డి, శివ్వంపేట సర్పంచి పి. శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచులు రాజిపేట పద్మ వెంకటేష్, ప్రభాకర్‌రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ రామచంద్రంగౌడ్, నాయకులు కొడకంచి రవీందర్‌గౌడ్, ఆకుల శ్రీనివాస్, నాగేశ్వరరావు, చెన్నాపూర్ రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంపీపీ హరికృష్ణలను సన్మానిస్తున్న దృశ్యం

## భూ తగాదాలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

**ఒకరికి తీవ్ర గాయాలు**

**హుస్నాబాద్, డిసెంబరు 11,ప్రభాతవార్త :** భూతగాదాలలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేటమండలం జనగామ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఐదు సంవత్సరాలుగా ఇరువర్గాల మధ్య భూతగాదా నడుస్తుందని, ఈ నేపథ్యంలో ఆదివారం భూమివద్దకు విచ్చిన ఓ వర్గం వారు మరో వర్గం వారిని ఎందుకు వచ్చావని మందలించడంతో మాటా మటా పెరిగి దాడి జరిగిందని,ఈ దాడిలో ఓ వర్గానికి చెందిన ఏడుగురికి స్వల్పగాయాలు కాగా మరో వర్గానికి చెందిన ఇమాన్యూల్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయని, విషయం గమనించిన స్థానికులు 108లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిసింది.ఈ విషయంపై అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందిందని,కేసు నమోదు చేసుకుని ధర్యప్తు చేస్తామని ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపారు.



బీహెచ్ఈఎల్ డిపో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గోదావరిఅంజిరెడ్డి

## టిఎస్ఆర్టీసీ బీహెచ్ఈఎల్ డిపోను స్థానికంగానే ఉంచాలి

**బిజెపి మహిళ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరిఅంజిరెడ్డి**

**రామచంద్రాపురం, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** రామచంద్రాపురం పరిధిలోని టీఎస్ఆర్టీసీ బీహెచ్ఈఎలన డిపోను స్థానికంగానే ఉంచాలని రాష్ట్ర బిజెపి మాజీ మహిళ ప్రధాన కార్యదర్శి సి గోదావరిఅంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామచంద్రాపురం పట్టణంలో 1988వ సంవత్సరంలో బీహెచ్ఈఎల్ కంపెనీ వారు స్థానిక రవాణా సంస్థ కోసం టీఎస్ఆర్టీసీకి స్థలం కేటాయించడం జరిగిందని అన్నారు. కానీ ఇపుపడు దానిని రంగారెడ్డి జిల్లాకు అనుసంధానించడం స్థానికంగా కలకం రేపుతుందని ఆమే ఆవేధనవ్యక్తం చేశారు. బీహెచ్ఈఎల్ డిపోను స్థానికంగా ఇక్కడే ఇంచాలని అధికారులు డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈ ఏరియా నుండి 1,50,000 మంది స్థానికంగా అనగా పటాన్చెరు నియోజకవర్గం పరిధిలో ప్రయాణం చేస్తున్నారని అన్నారు. ఈ డిపో కింద లోకల్ సర్వీసులు 25 నుండి 30 ప్రతిరోజు 50 గ్రామాలకు తిరుగుతున్నాయని తెలిపారు. స్కూలు, కాలేజీలు సుమారుగా లక్షమంది విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. బీహెచ్ఎల్ డిపో స్థానికంగా ఉన్న సంగారెడ్డిలో లేక గ్రేటర్ హైదరాబాద్లో గాని ఉండాలని, అలా కాకుంగా రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేయడం వల్ల ఇక్కడ ఉన్న విద్యార్థులకు, ఉద్యోగులకు భారీ నష్టం జరుగుతుందని ఆమె అన్నారు. బీహెచ్ఎల్ కంపెనీ వారు ఇచ్చిన స్థలం టీఎస్ఆర్టీసీ బస్ డిపోను ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామని, లేదంటే దీనిపై అధికారులకు ఫిర్యాదుచేసి చర్యలు తీసుకోవాలని కోరుతామని గోదావరిఅంజిరెడ్డి ఆధ్వర్యంలో బీహెచ్ఈఎల్ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మల్లేష్, సంజీవ, దేవేందర్రెడ్డి, భూపాల్రెడ్డి, రమేష్, కిష్టయ్య, ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు.

## దళితులపై దాడి అత్యంత దుర్మార్గమైన చర్య

**కెవిపిఎస్ నాయకులు**



కంగ్టిలోని నిరసన తెలుపుతున్న మండల కెవిపిఎస్ నాయకులు

**కంగ్టి, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** కంగ్టి కెవిపిఎస్ మండల అధ్యక్షుడు రాహుల్, కెవిపిఎస్ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ నల్గొండ జిల్లా నార్కెట్పల్లి మండలం బాజకుంట గ్రామంలో ఒకరి ఇంట్లో దేవతల పండుగ చేయడంతో కలువృత్తిలో భాగంగా డప్పు కొట్టేందుకు దళితులు వెళ్లారు. అయితే పండుగ అయిపోయిన తర్వాత దళితులు భోజనం చేయడానికి అక్కడికి వెళ్లారు. అదేసమయంలో గ్రామానికి చెందిన మహిళా సర్పంచ్ సరితరెడ్డి భర్త రవీందర్రెడ్డి, ఇంద్రరెడ్డి, కులస్తుల భోజనం చేస్తున్నారు. తాము భోజనం చేసిన తర్వాత రావాలని దళితులకు చెప్పడంతో వెళ్లిపోయారు. అయితే గంట తర్వాత దళితలు భోజనం చేయడానికి వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్నవారు భోజనాలు పూర్తికాలేదు, అప్పుడే వస్తారా అంటూ ఆగ్రహించిన రవీందర్రెడ్డి, ఇంద్రారెడ్డి వారిపైన దాడి చేశారు. దీంతో దళితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే గ్రామపంచాయతీ ఆవరణలో పెద్దల సమక్షంలో కేసు విషయం మాట్లాడుతుండగా మా పైన కేసు పెడతారా అంటూ విచక్షణ కోల్పోయిన సర్పంచ్ సరితారెడ్డి చెప్పుతో వికలాంగుడైన దళితుడు వర్కల్ల సైదులు, పరుశురాము ల పైన కుల అహంకారంతో దాడి చేసింది. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా దళితులపైన దాడులు చేడయం సిగ్గుచేటు అన్నారు. దాడి చేసిన అగ్రకుల పెత్తందారులపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠనంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ కంగ్టి మండల అధ్యక్షులు రాహుల్, కమిటీ సభ్యులు అశోక్, శ్రీకాంత్, యేసప్ప, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివ రాథోడ్

**కంగ్టి, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని ముకుంద నాయక్ తాండకు చెందిన శివ రాథోడ్ ను తెలంగాణ కాంగ్రెస్ యూత్ వైస్ ప్రెసిడెంట్గా నియమించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, నేషనల్ యూత్ కాంగ్రెస్ ఇంఛార్జ్ కృష్ణా అల్లువురి, నేషనల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బివి శ్రీనివాస్ లకు తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శివసేనరెడ్డి, తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఇంఛార్జ్ సురభి ద్వివేడి, రమేష్ బాబు, సయిద్ కలిద్ అహ్మద్ ప్రత్యేక ధన్యవాలు తెలిపారు. ఇకముందు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటంలో నావంతు కృషి చేయటంలో నిమగ్నుడినై ఉంటానని, తెలంగాణ రాష్ట్రములో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావటానికి కృషి చేస్తానని తెలియజేస్తూ మరొకసారి నన్ను నమ్మిక నాకు ఇంతటి గొప్ప పదవీ బాధ్యతలు ఇచ్చిన ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకుడికి ఋణపడి ఉంటానని శివ రాథోడ్ తెలిపారు.

## ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం

**ఎస్ఐ అబ్దుల్ రవూఫ్**

**పెద్దేముల్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, అందుకు ప్రతి గ్రామంలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ అన్నారు. జిల్లా ఎస్పి కోటిరెడ్డి ఆదేశాల మేరకు పెద్దేముల్ మండలంలోని తట్టెపల్లిలో జిల్లా పోలీసు కళాబృందచే కరోనా బారిన పడకుండా తగు జాగ్రత్తలు, రొడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్, మూఢ నమ్మకాలు, బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, 100 డయల్, షీటిం 181, బాల్య వివాహలు, మానవ అక్రమ రవాణ, గంజాయి, డ్రగ్స్ నిషేదం, సైబర్ క్రైమ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ సీసీ కెమేరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట భాగ్యలక్ష్మి, యంపిటిసి సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అయ్యప్ప స్వామి భారీ ఊరేగింపు

**శంకర్పల్లి, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** శంకర్పల్లి పట్టణంలో అయ్యప్ప స్వామీ భారీ ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. సోమవారం ఘణంగా శంకర్పల్లి పట్టణంలో పెద్ద ఎత్తున అయ్యప్ప స్వామి ఉరేగింపు చేస్తున్నట్లు అయ్యప్ప సేవ మండలి సభ్యులు తెలిపారు. ఊరేగింపు సోమవారం ఉదయం 7 గంటలకు హనుమాన్ మందిర్ నుండి అయ్యప్ప దేవాలయం వరకు, అయ్యప్ప స్వామి ఉరేగింపు కార్యక్రమం నిర్వహిచనున్నట్లు తెలిపారు. అలాగే మంగళవారం ఉదయం 10 గంటలకు అయ్యప్ప దేవాలయంలో శ్రీ అయ్యప్ప స్వామివారి వార్షిక మహాపడిపూజ మహోత్సవం చేయడం జరుగుతుందని తెలిపారు. అన్నదాన ప్రభువులు శంకర్పల్లి మున్సిపాల్ కౌన్సిలర్ జులకంటి శ్వేత పాండురంగారెడ్డి, కంకంటి జంగయ్య, ఆధ్వర్యంలో అన్నధాన కార్యక్రమం ఉంటుందని అయ్య ప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరిం చాలని కోరారు,

### పోచమ్మగుడి నిర్మాణానికి భూమిపూజ

**తలకొండపల్లి డిసెంబర్11,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామపంచాయతీ చెన్నంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ గుడి నిర్మాణానికి ఆదివారం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పి కోఆప్షన్ సభ్యుడు మూజీబుర్ రహేమాన్, లక్ష్మీ నారాయణ గౌడ్, దశరథం యాదవ్, మస్క వెంకటయ్య, పెంటయ్య గౌడ్, జంగయ్య, కృష్ణయ్య, రామచంద్ర్య, చెన్నయ్య, ఆంజనేయులు, శేఖర్, అంతయ్య, రవి, శ్రీశైలం, సాయి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా విష్ణుగౌడ్

**తలకొండపల్లి డిసెంబర్11,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన విష్ణు గౌడ్కు మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచందర్ రెడ్డి సతిమణి ఆశ్లేష రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుజ్జల మహేష్ ,జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్ రెడ్డి, సినియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, కల్వకుర్తి సోషల్ మీడియా ఇంచార్జి అజీమ్ ,యూత్ కాంగ్రెస్ అధ్య క్షుడు జనార్ధన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటేష్, శ్రీనివాస్ చారి, సుదర్శన్ రెడ్డి, ఆరిఫ్, వెంకటేష్, బాలకృష్ణ, జంగయ్య, ప్రవీణ్ రెడ్డి, సుదర్శన్ రాజు, శివ రమేష్ నాయక్, రాజు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీనివాస్ యాదవ్ను సన్మానించిన నాయకులు

**తలకొండపల్లి డిసెంబర్11,ప్రభాతవార్త :** అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం హెచ్ఆర్ఏ పురస్కారం 2022 ఎంపికైన టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్కు డబ్ల్యుహెచ్ఆర్ఏ వారిచే నెల్లూరు పట్టణంలో అవార్డు అందు కొని ఆదివారం తన స్వగ్రామ వెల్జాల్కు వచ్చిన సందర్భంగా ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నూకం శేఖర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, విజయ్ యాదవ్, మధు యాదవ్, శ్రీరాములు, నరసింహ, శీను, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బి.అర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారు

**మంత్రి తన్నీరు హరీష్రావు**

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా డాక్టర్ బి.అర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని ఒక వర్గానికి పరిమితం చేయడం సరికాదని రాష్ట్ర అర్థిక, అరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత మార్కెట్లో రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి.అర్.అంబేద్కర్ జీవిత చరిత్ర, లక్ష్యాలపైన 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శనను అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి కార్యక్రమాన్ని అయన అదివారం ప్రారంభించి తిలకించి మాట్లాడారు. మతతత్వ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. చదువు ప్రాముఖ్యతను అనాడే అంబేద్కర్ వివరించాని తెలిపారు. అంబేద్కర్ చెప్పిన స్ఫూర్తిని చక్కగా ప్రదర్శించారని పేర్కొన్నారు. మతం పేరిట రాజకీయాలు చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగు జాడల్లో నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సుడా ఛైర్మన్ మారెడ్డి రవీందర్రెడ్డి, కౌన్సిలర్లు సాకి బాల్లక్ష్మీఆనంద్, నాయిని చంద్రం, బిఅర్ఎస్ నాయకులు వేలేటీ రాధాకృష్ణశర్మ, మచ్చ వేణుగోపాల్రెడ్డి, కొండం సంపత్రెడ్డి, మోహన్ లాల్, దళిత సంఘం నాయకులు భీంసేనా, అస లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి బిజెపి భరోసా యాత్రను విజయవంతం చేయండి

**యాత్రకు హాజరుకానున్న మాజీ మంత్రి బాబుమోహన్**

**మునిపల్లి, డిసెంబర్ 11 ప్రభాతవార్త :** బిజెపి చేపడుతున్న ప్రజాగోస భరోసా యాత్రలో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు మునిపల్లి మండలంలో పర్యటించనుందని బిజెపి మండల అధ్యక్షులు సుమన్, ప్రధాన కార్యదర్శి రాఘుఘు, నాయకులు నగేష్ యాదవ్, సంగయ్య స్వామి, శంకరయ్యలు ఆదివారం స్థానిక విలేకరులు సమావేశంలో తెలిపారు. ఈ యాత్రలో మాజీ మంత్రి బాబుమోహన్ తోపాటు రాష్ట్ర జిల్లా నేతులు, హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మండంలోని కంకోల్, లింగంపల్లి, మొగ్దుంపల్లి, బొడశట్పల్లి, మేళసంగం, పెద్దచెల్మెడ, మన్సన్పల్లి, తాటిపల్లి వరకు బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని బిజెపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి మండల నాయకులు కోరారు.

### బాధితులకు ఆర్థిక సహాయం అందజేత

గుమ్మడిదల, డిసెంబర్ 11, ప్రభాతవార్త: గుమ్మడిదల గ్రామంలో నల్తూరి కిష్టయ్య, భార్య పోచమ్మ, సాయిరెడ్డి లకు అనారోగ్యంతో చనిపోయిన సమాచారాన్ని తెలుసుకున్న టిఆర్ఎస్ జిల్లా యువనేత మూడు చింతల నరేందర్రెడ్డి మృతుల కుటుంబాన్ని పరామర్శించి, వారికి నేనున్నానని భరోసా ఇచ్చి ఆర్థికసాయం అందజేశారు, ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆకుల ఆంజనేయులు, అతినారం రాము, నాయకులు దత్తాత్ర్యే, దాసరి ఆంజనేయులు, గౌస్, యాదగిరి, పడమటి రాజు, చిమ్ముల శ్రీనివాస్రెడ్డి, సంతోష్రెడ్డి, కాజామీయా, కొత్త కృష్ణ, మచ్చేందర్రెడ్డి, నవీన్, శ్రీకాంత్ చారి, దీక్షిత్, కుంటి పెంటయ్య, మల్లేష్, తుడుం రవి, తుడుం రాజు, సుధాకర్, రమేష్, జాంగిర్, పాల్గొన్నారు.

### ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయండి

**చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు అరుణ్కుమార్ పిలుపు**

**చేవెళ్ళ, డిసెంబర్ 11, ప్రభాతవార్త**

ఈ నెల 13వ తేది నుండి 16 వరకు హైదరాబాద్ నగరంలోని ఉస్మా నియా యూనివర్సిటి నిర్వహించే అఖిల భారత ఎస్ఎఫ్ఐ 17వ మహసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు బేగరి అరుణ్కుమార్ పిలుపునిచ్చారు. అదివారం చేవెళ్ల మండల కేంద్రంలో విలేకరులతో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు బేగరి అరుణ్కుమార్ మాట్లాడుతూ నగరంలోని ఉస్మానియా యూని వర్సిటీ ఠాగూర్ అడిటోరియంలో జరుగుతున్న సహసభలకు ముఖ్య అతిథిగా త్రిపుర మాజీ ముఖ్య మంత్రి మాణిక్ సర్కార్ పాల్గొంటా రన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నిర్వహించే మొట్ట మొదటి సారిగా 17వ అఖిల భారత ఎస్ఎఫ్ఐ మహసభలను జరుపు తున్నామన్నారు.

### మాజీ సర్పంచ్కు ఎమ్మెల్సీ నివాళి



పెద్దయ్య పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, డిసెంబర్11, ప్రభాతవార్త:** ఆమనగల్లు పూర్వపు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గుజ్జరి పెద్దయ్య మృతికి టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పెద్దయ్య అకాల మరణం కలచివేసిందని ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి ఆదివారం టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్రెడ్డితో కలిసి ఆమనగల్లు పట్టణంలో గుజ్జరి పెద్ద య్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మె ల్సీ వెంట ఎంపిపి అనితవిజయ్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ సభ్యుడు వస్పు ల జంగయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, గుత్తి బాలస్వామి, రూపం వెంకట్రెడ్డి, విజయ్రాథోడ్, మెకానిక్ బాబా తదితరులు ఉన్నారు.

### 13న ఎంఆర్పిఎస్ నూతన కమిటీ ఎన్నిక

**ఆమనగల్లు, డిసెంబర్11, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల ఎంఆర్ పిఎస్ నూతన కమిటీని ఈనెల 13న ఎన్నుకుంటున్నట్లు ఆపార్టీ మండల ఇంచార్జీ చంద్రకిరణ్ తెలిపారు. పట్టణంలోని లక్ష్మీనర్సింహ్మ గార్డెన్స్లో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకుని పార్టీ సిద్దాం తాల మేరకు కమిటీని ఎంపిక చేయనున్నట్లు ఆయన వివరించారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం పార్టీ జిల్లా నాయకులు మల్లేపోగు మల్లేశ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమనగల్లు మండల నూతన కమిటీపై చర్చించి డిసెం బర్ 13న మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సమావేశంలో సీనియర్ నాయకులు వస్పుల సాయిలు, కృష్ణ య్య, విజయచందర్, సత్తయ్య, రవి, దశరథ్, సుదర్శన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మల్లికార్జున ఖర్గేను కలిసిన బోయ అశోక్కుమార్

**తాండూరు, డిసెంబరు 11, ప్రభాతవార్త :** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను తాండూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయ అశోక్కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం కల్బుర్గిలోని ఆయన నివాసంలో మల్లికార్జున ఖర్గేను అశోక్కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆయన కుమారుడు ఏఐసీసీ కర్ణాటక ఇంచార్జ్, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబును, తెలంగాణ మీడియా ఇంచార్జ్ చైతన్ను కూడ కల్బుర్గి ఎయిర్పోర్ట్లో కలిశారు. ఈ సందర్భంగా వారి సూచనల మేరకు తాండూరులో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని అశోక్ తెలిపారు.

### కనుల పండువగా మల్లన్న ఉత్సవాలు

**ప్రత్యేక పూజలు చేసిన బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్పటేల్**



మల్లన్న జాతర ఉత్సవాలలో పాల్గొన్న శుభప్రద్పటేల్

**తాండూరు, డిసెంబరు 11, ప్రభాతవార్త :** తాండూరు మండలం గౌతాపూర్లో మల్లన్న జాతర ఉత్సవాలు కన్నుల పండువగ నిర్వ హించారు. కుర్వ సంఘం ఆహ్వానం మేరకు రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్తో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మల్లన్న ఆశిస్సులు పొందడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. తాండూరు ప్రాంత ప్రజలు మల్లన్న స్వామి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. మరోవైపు ఆలయ కమిటి నిర్వహకులు బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్తో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజప్ప, ఎంపీటీసీ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ నాగప్ప, దస్తప్ప, మల్లికార్జున్, శ్రీను, శ్రీకాంత్, నాయకులు భాను, బాలు, ప్రశాంత్, రాముగౌడ్, నరేష్, హరీష్ పాల్గొన్నారు.

## అసెంబ్లీలో బీసీలకు 75 సీట్లు కేటాయించాలి

**కొడంగల్, డిసెంబర్ 11ప్రభాతవార్త**

జనాభాలో 56శాతం ఉన్నటువంటి బీసీలకు జనాభా దామాషా ప్రకారం తెలంగాణా రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 75 సీట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నట్లు జాతీయ బీసీ సంఘం నియోజకర్గ అధ్యక్షులు మన్నె బస్వరాజ్యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతు స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా బీసీలు ఓట్లు వేసే యంత్రాలుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 75 సంవత్సరాలుగా బీసీ కులాల్లోని కొన్ని వర్గాలు ఇంకా అసెంబ్లీ మెట్లు ఎక్కక పోవడం విచారకరమన్నారు. రానున్న ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని లేని పక్షంలో రాజకీయ పార్టీలకు బీసీల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. బీసీలందరూ ఓటు బ్యాంకుగానే కాకుండా రాజ్యాధికారం దిశగా ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



అట్టాహాసంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకల దృశ్యం

## యువత క్రీస్తు మార్గంలో నడవాలి

**డిఎస్ విజయరత్నం**

**మొయినాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** అట్టాహసంగా మొయినాబాద్ జిల్లా మోథోడిస్ట్ యూత్ ఫెలోషిప్ అధ్యక్షుడు బోద రాహుల్ అధ్యక్షతన ఘణంగా క్రిస్మస్ యూత్ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మొయినాబాద్ మోథోడిస్ట్ జిల్లా అధికారి రెవ.బి. విజయరత్న హజరయ్యారు. మోథోడిస్ట్ జిల్లా తరుపున క్రిస్మస్ క్యారల్స్ సంగీత పోటీలను నిర్వహించారు, వివిధ గ్రామాల మోథోడిస్ట్ చర్చీల నుండి యువతి, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డిఎస్ ప్రార్దనతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు, చిన్నమంగళారం పాస్టర్ రెవ.జాన్ బి. బ్యేనోని, పాస్టర్ జోయల్ ఇమ్మానియేల్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నడిపించారు, డిఎస్ క్రిస్మస్ పండుగ వేడుకల గూర్చి వచ్చిన యువతి యువకులను ఉద్దేశించి వాక్యబోధన చేస్తు యవనకాలంలో క్రీస్తు కాడి మోయాలని, యవన వయస్సులో క్రీస్తును అంగీకరించి లోక సంబందమైన కార్యక్రమాలను విడిచి క్రీస్తు మార్గంలో నడువాలని అన్నారు. దేవుని ప్రేమ కలిగి ఉంటే జీవితంలో మీ యొక్క వృత్తులను సక్రమంగా నిర్వహిచి మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. క్రీస్మస్ అంటే సంబరాలు కాదని మీ జివితంలో గత క్రీస్మస్ పండుగ నుండి నేటికి నీ జీవితంలో క్రొత్త వెలుగు వచ్చిందాలేదా మీరు మీ జీవితాలను ఎంతమేరకు క్రీస్తు పట్ల భయం, భక్తి కలిగి మీ నడవడికను ఏ మేరకు మార్చుకున్నారో పరీక్షించుకోవాలన్నారు. క్రీస్తును అంగీకరించి వారు వారి యవనంలో ఉన్నటువంటి దురాలువాటులను వదిలి, తమ తోటివారితో క్రీస్తు ప్రేమ కలిగి అందరితో ప్రేమ పూర్వకంగా మెలుగాలన్నారు. యవనంలో నిబ్బరంగా క్రీస్తు ప్రేమలో కొనసాగితో జీవితంలో మంచి ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, క్రీస్మస్ అంటేనే మానవాళికి బహుమతి అని మన వద్ద ఉన్నదాంట్లో ఎంతో కొంత ఇతరులకు సహాయం చేయాలన్నారు, క్రీస్మస్ క్యారల్స్ పోటల పోటీల జడ్జీలుగా శ్రీహరి, వినేయ్,లు వ్యవహరించారు. మొదటి బహుమతి నార్సింగి మోథోడిస్ట్ చర్చ్, రెండోవ బహుమతి శ్రీరామ్నగర్ మోథోడిస్ట్ చర్చ్, మూడవ బహుమతి కోల్లూర్ మోథోడిస్ట్ చర్చ్ యూత్వారు విజేతలుగా నిలిచారు, ఈ కార్యక్రమానికి భోజనవ ఏర్పాట్లు వట్టినాగులపల్లి మోథోడిస్ట్ చర్చ్ ఈ, చిరంజీవి, పెద్దమంగళారం మోథోడిస్ట్ చర్చ్ బ్యెంజిమేన్, మొయినాబాద్ యుత్, వివిధ గ్రామాల యువకులు ఆర్దికంగా మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు లాజర్, రత్నం, మొయినాబాద్ జిల్లా యూత్ సెక్రెటరి సోమిత్, అడ్వాసైర్లు, చిరంజీవి, కె.శ్రీకాంత్, చేవెళ్ల ప్రభుచరణ్, లింగాల ప్రశాంత్, కె. శ్రీధర్, రవిస్యామ్లు, టి.వికాస్ లు ప్రత్యేకంగా బాధ్యతలు నిర్వహించారు. నందు, వినోధ్, జాన్, రోహిత్, సన్నీ వివిధ గ్రామాల యువతి, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చట్టసభల్లో ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీలకు 85 శాతం రిజర్వేషన్లు

**కౌన్సిలర్ బాలగోని డిమాండ్**



అంబేద్కర్కు నివాళులు అర్పిస్తున్న కౌన్సిలర్ వెంకటేశ్గౌడ్, పిబిఐ సమన్వయకర్త అరుణ్కుమార్

**ఘట్కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంతోనే బడుగు, బలహీనవర్గాలకు చట్టసభల్లో పదవులు లభిస్తున్నాయని పోచారం మున్సిపల్ కౌన్సిలర్ బాలగౌని వెంకటేష్గౌడ్ పేర్కొన్నారు. ఘట్కేసర్లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 87వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. పోచారం మున్సిపల్ కౌన్సిలర్ బాలగౌని వెంకటేశ్గౌడ్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. మేడ్చల్ జిల్లా ప్రబుద్ధభారత్ సంస్థ సమన్వయకర్త మీసాల అరుణ్కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేశ్గౌడ్తో పాటు పలువురు నాయకులు భారత రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 85 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కౌన్సిలర్ బాలగౌని డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద ధృడమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన అంబేద్కర్ ఆశయాల సాధనలకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం భరత్ సూక్తి చెబుతూ స్వతంత్రంగా జీవించే అవకాశం ఉండి, బానిస భావాలు కల్గిన వ్యక్తి కన్నా స్వతంత్ర భావాలున్న బానిస వేయిరేట్లు మేలు అని అంబేద్కర్ మాటలను గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో ఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మీసాల మల్లేశ్, పోచారం మున్సిపల్ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు మీసాల రాజేశ్కుమార్, మాజీ వార్డుసభ్యులు ఎండి.రహిముద్దిన్, నాయకులు బొడ్డు నర్సింగ్రావు, వై.వెంకటేశ్వరరావు, పి.రూపేష్కుమార్, టి.అంజయ్య, బి.గణేశ్గౌడ్, బోడ కిరణ్కుమార్, కొలకలూరి నవీన్కుమార్, కె.సాగర్, వినయ్, శ్రీశైలం, బాబా, కిరణ్, మల్లేశం, అనిల్, భరత్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘట్కేసర్లో రహదారికి బీటీతో మరమ్మతు పనులు

**ఘట్కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** ఘట్కేసర్ పట్టణంలో రోడ్ల అభివృద్ధికి తగిన చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ తెలిపారు. ఘట్కేసర్ పట్టణంలో శనివారం అర్ధరాత్రి ప్రధాన రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపట్టారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు రహదారిపై బీటీ వేయించి మరమ్మత్తులు చేయించారు. మున్సిపల్ చైర్పర్సన్ రహదారి బీటీ పనులను పర్యవేక్షించారు. పట్టణంలోని పాత జాతీయ రహదారితో పాటు ఎదులాబాద్ రోడ్డు, పలు చోట్ల గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. దీంతో రోడ్ల మరమ్మత్తు చేయాలని మున్సిపల్ పాలకవర్గం తీర్మాణం చేసి నిధులు విడుదల చేసింది. ఈమేరకు అంబేద్కర్ చౌరస్తాలో పాటు పలు చోట్ల బీటీ వేయించి పనులు చేశారు. కొండాపూర్రోడ్డు, ఎన్ఎఫ్సీనగర్రోడ్డు, కరీంగూడరోడ్డుకు కూడా మరమ్మత్తు పనులు చేయనున్నట్లు ఆమె తెలిపారు. మంత్రి మల్లారెడ్డి, కౌన్సిలర్లు, అధికారుల సహకారంతో మున్సిపల్లోని అన్ని కొత్తగా బీటీ రోడ్లు వేసేందుకు కృషి చేస్తున్నామని ఆమె చెప్పారు. రోడ్డు పనులు నాణ్యతతో ఉండాలని ఆమె కాంట్రాక్టర్కు సూచించారు. కౌన్సిలర్ షేక్ జహంగీర్, మాజీ వార్డుసభ్యులు ఎండి. రహిముద్దిన్, వర్క్ఇన్స్పెక్టర్ రాకుష్, కార్మికులు ఉన్నారు.



రహదారిపై బిటి పనులు చేయిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్ పావని



సమావేశానికి హాజరైన బిసి ఉపకులాల నాయకులు

## బిసి భవన్‌కు రూ. 2 కోట్లు కేటాయించాలి

**-బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్**

**హుస్నాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** పట్టణంలో బిసి భవన్ ఏర్పాటు చేయడానికి ఎకరం భూమితో పాటు భవనం నిర్మాణానికి 2కోట్లు మంజూరు చేయాలని బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి 23 ఉప కులాల అధ్యక్షులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ జనాభా దమాషా ప్రకారం బిసిలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడంతో పాటు రిజర్వేషన్‌ను పెంచాలన్నారు. అనంతరం ఉపకులాల అధ్యక్ష కార్యదర్శులును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, సుదర్శన్‌చారి, సుదర్శన్, ఇంద్రాల సారయ్య, వరియోగుల అనంతస్వామి, సారయ్య, సదా నందం, ఐలయ్య, నారాయణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

### హాజ్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



హాజ్ సొసైటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా హాజ్ సొసైటీ ఎన్నికలు నిర్వహించగా నూతన కమిటీ ఆదివారం ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో హాజ్ సొసైటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులుగా సయ్యద్ ఖరోద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎం.ఎ. అలీం(సర్వర్), ప్రధానకార్యదర్శిగా ఎం.డి.ఫఖ్రోద్దీన్, కార్యదర్శులుగా ఎం.డి. ఫరీదొద్దీన్, ఎం.డి.మాసూర్ కోశాధికారిగా వాజిద్ పటేల్, పిఆర్‌ఓగా ఎం.డి. శాహెర్ కార్యవర్గ సభ్యులుగా మరో 19 మంది ప్రమాణ స్వీకారం చేశారు.

## శబరిమల యాత్ర బస్సులపై 10 శాతం రాయితీ

**-నారాయణఖేడ్ డిపో మేనేజర్ మల్లేశయ్య**



బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

**పెద్దశంకరంపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** శబరిమలకువెళ్లే అయ్యప్ప స్వామి భక్తులకోసం స్పెషల్ బస్సులు అందుబాటులో ఉన్నట్లు నారాయణ ఖేడ్ డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. ఆదివారం పెద్దశంకరంపేట బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ అందిస్తున్న సేవలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మల్లేశయ్య మాట్లాడుతూ శబరిమల యాత్ర బస్సులపై ఎలాంటి డిపాజిట్ లేకుండా 10 శాతం రాయితీపై సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అయ్యప్ప భక్తులు ప్రైవేటు బస్సులను ఆశ్రయించి నష్టపోకుండా ఆర్టీసీ అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రయాణికుల సౌకర్యార్థం సరైన వేళల్లో బస్సులు నడిపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ సెల్ ఇంచార్జి పాండు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసి రూరల్ సిఐ



క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మాణిక్‌రావును కలిసిన రూరల్ సిఐ వెంకటేశ్

**జహీరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** జహీరాబాద్ రూరల్ సిఐగా శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన నోముల వెంకటేశం ఆదివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయానికి సిఐ వెంకటేశం చేరుకుని ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించారు. రూరల్ పరిధిలోని హద్నూర్, రాయికోడ్, ఝరాసంగం పోలీసు ఠాణాల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అంకిత భావంతో పని చేయాలని, అందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే రూరల్ సిఐ వెంకటేశ్‌కు వివరించారు.

### వివాహానికి హాజరైన బిజెపి నేత

**ఝరాసంగం, డిసెంబరు 11, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ జహీరాబాద్ ఇంఛార్జి జంగం గోపి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని కక్కరవాడ గ్రామానికి చెందిన తమ్మలి మహేశ్ వివాహం ఝరాసంగంలో వైభవంగా కొనసాగింది. పెళ్లి కార్యక్రమానికి చేరుకున్న జంగం గోపి నూతనవధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యు లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బడుగు, బలహీన వర్గాలకు అండగా సిఎంఆర్‌ఎఫ్

**వెల్దుర్తి, డిసెంబర్11 ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాలను ఆపదలో ఆదుకోవడానికి సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఎం.జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్‌కు రూ. 20 వేల సీఎంఆర్‌ఎప్ చెక్కును వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను ఆపదలో ఆదుకోవడానికి సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుం దన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, జలాల్‌పూర్ టీఆర్‌ఎస్ నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ

**కొండపాక, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిమ్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు పాతకోటి లింగం తండ్రి సత్తయ్య అనారోగ్యంతో గత నాలుగు రోజుల క్రితం మృతి చెందగా ఆదివారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మృతుని కుటుంబ సభ్యులను, అదే విధంగా బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కూరెళ్ళ గోవర్ధన్‌రెడ్డి నానమ్మ వెంకవ్వ మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామ‌ర్శించి ఓదార్చారు. అయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, సర్పంచ్ మల్లమారి రవీందర్, ఆత్మకమీటి డైరెక్టర్ సున్నం భాస్కర్, నాయకులు కాశిరెడ్డి మహిపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు సాదుపల్లి కనకసేన, మాజీ ఉప సర్పంచ్ వంగ శ్రీనివాస్, నాయకులు కోల స్వామి, చింతల భాస్కర్, ఎర్రుల బాల్‌రాజు, ఈగ చిన్నరాజు, కృష్ణారెడ్డి, బొద్దుల మదు, నర్సింలు, రాజయ్య, సత్యనారాయణ, లింగంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 5న టిబేస్ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు

**టిబేస్ రాష్ట్ర అధ్యక్షుడు పిపి రాథోడ్**





మాట్లాడుతున్న టిబేస్ రాష్ట్ర అధ్యక్షులు పిపి రాథోడ్

**నర్సాపూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్(టిబేస్) రాష్ట్ర అధ్యక్షులు పిపి రాథోడ్ పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని నూతనంగా నిర్మిస్తున్న బంజారా భవనంలో తెలంగాణా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు పిపి రాథోడ్ మాట్లాడుతూ తెలంగాణా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను జనవరి 5 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణా ఎంప్లాయిస్ సేవా సంఘ్‌కు ప్రభుత్వం గుర్తింపునిచ్చి ఇందులో పని చేస్తున్న నాయకులకు ప్రభుత్వం ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. అంతేగాక తెలంగాణా ఎంప్లాయిస్ సేవాసంఘ్ అధ్వర్యంలో జాగో బంజారా పేరిట తండాల్లో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకుగాను టిబేస్ సంఘ్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినందుకు, సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించినందకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే తెలంగాణా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను జనవరి 5 వ తేదీనా పటాన్‌చెరులోని జీఎంఆర్ పంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నందున ఉత్సవాలకు రాష్ట్రంలోని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిపి రాథోడ్ కోరారు. కార్యక్రమంలో టిఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకులు లకావత్ రమేశ్‌నాయక్, తెలంగాణా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం నాయకులు తులసీదాస్ రాథోడ్, పెంట్యానాయక్, రాందాస్ చౌహాన్, అర్జున్ నాయక్, బుచ్యానాయక్, బాల్‌రాజునాయక్, రాంచందర్‌నాయక్, గణేశ్ నాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

### శారీరక మానసిక ఆరోగ్యానికి యోగ ఎంతో అవసరం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** శారీరక మానసిక ఆరోగ్యనికి యోగతో ఎంతో అవసరమని రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు పాల సాయిరాం అన్నారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్వర్యంలో వ్యాస మహర్షి యోగ సెంటర్‌లో నిర్వహిస్తున్న బాలల యోగ శిబిరంలో విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడాకాలకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ పెంచడానికి యోగ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగతో అరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మాణం చేయొచ్చన్నారు. కౌన్సిలర్ సద్ది నాగరాజురెడ్డి మాట్లాడుతూ యోగా చాల ముఖ్యమన్నారు. ప్రతి రోజు అచరణ చేస్తే ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు తోట సతీష్, సంధ్య, యోగా సభ్యులు సురేష్, రామరాజు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ మల్లిఖార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**నర్సాపూర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో వెలిసిప శ్రీకేతకీ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ నిర్మాణ దాత,బిజెపి నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో శ్రీకేతకీభ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామికి రుద్రాబిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వేద పండితులు గౌడిచర్ల హరిప్రసాద్‌శర్మ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన ఈ ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ మేరకు శ్రీ మల్లికార్జునస్వామికి అభిషేకం, అర్చన, హారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్బంగా వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఈ ఆలయంలో శ్రీమల్లికార్జునస్వామికి రుద్రాబిషేకం, పూజలు జరిపించడం జరుగుతుందని తెలిపారు. అంతేగాక ఆలయంలో జనవరి 5న బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత ,బిజెపి నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ దంపతుల తో పాటు పూజారి హరిప్రసాద్‌శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### చతుర్ధి పూజలందుకున్న చందన లేపనుడు

**న్యాల్‌కల్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని రేజింతల్ గ్రామ శివారులోని స్వయంభూవు శ్రీసిద్దివినాయక, హద్నూర్ గ్రామ శివారులోని శ్రీవరసిద్ది వినాయక ఆలయాలు ఆదివారం సంకష్టహర చతుర్థిపర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల కోలాహలం నెలకొంది. రేజింతల్ ఆలయంలో అర్చకులు మోహన్‌రావు జ్యోషి, వినోద్, ప్రకాశ్, వెంకటేశ్వర జ్యోషిలు, హద్నూర్‌ఆలయంలో పురోహితులు గణపతిదీక్షితులు, రుక్మాపూర్ సిద్దయ్యస్వామిలు స్వామి వారికి అభిషేకం చేసి చందనలేపనం అద్ది రంగు రంగు పూలు, గరకతో స్వామి వారి విగ్రహాలను అందంగా అలంకరించారు. ఆయా ఆలయాలకు చేరుకున్న భక్తులకు రేజింతల్ ఆలయంలో 21మంది దాతల సహకారంతో తీర్థ ప్రసాదాలు,అన్నదానం నిర్వహించగా, హద్నూర్ ఆలయంలో ఆలయ కమిటి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. రేజింతల్ ఆలయానికి తొగుట పీఠాధిపతి మాధవానందస్వామి వారు చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో భక్తుల సమక్షంలో సిద్ది బుద్ది సమేత గణపతి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### నూతన వధువులను ఆశీర్వదించిన ప్రముఖులు

**మనూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** నూతన వధూవరులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే, టిపిసిసి ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్ శెట్కార్, జహీరాబాద్ మాజీ ఎంపి, టిపిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆశీర్వదించారు. మండలంలోని పుల్‌కుర్తి మాజీ ఎంపిటిసి సభ్యులు పోతుల సంగారెడ్డి కుమార్తె వివాహం ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్ జేపీ నగర్‌లోగల విశ్వనాథ్ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. శుభకార్యక్రమానికి ఎమ్మెల్యే వెంట మండల రైతు సమన్వయసమితి అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, ఎంపిటిసిసభ్యులు అంబారెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, సంగారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు ఉండగా మాజీ ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్ వెంట మనూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాష్‌రావుపాటిల్, రాయిపల్లి సర్పంచ్ రాచందర్‌రావు, ఉసిరికపల్లి మాజీసర్పంచ్ నాగోభరావు, మాజీ సొసైటీ చైర్మన్ మైలారం సంగారెడ్డి, నాయకులు బైండ్ల నారాయణ, మొల్లగఫూర్, మన్నెల్లి శాంతప్ప, శంక రప్ప, మాషం, డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి వెంట ప్రభాకర్‌రెడ్డి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి పోతుల సంగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

### పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

**గుమ్మడిదల, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** నల్లవల్లి గ్రామానికి చెందిన అందూర్ మల్లేష్ అనారోగ్యం కారణంగా మృతి చెందడం జరిగింది. స్థానిక బిఆర్‌ఎస్ పార్టీ నాయకుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న పటాన్‌చెరు శాసనసభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆయనకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, స్పందించి తన సోదురుడు గూడెం మధుసుదన్‌రెడ్డి ద్వారా ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దోమడుగు శంకర్, మల్లేష్ గౌడ్, పోచయ్య, ఆంజనేయులు, తలారి వీరయ్య, మధు, గ్రామ కమిటీ అధ్యక్షులు మహేష్, దానుల మధు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తా

**టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి**

నర్సాపూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త : నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండవ సారి ఎన్నికైన సందర్బంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గె తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని ఎంపిక చేశారని అన్నారు. ఇందులో తనకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈమేరకు రెండవ సారి టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారని తెలిపారు. దీంతో నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ గ్రామానగ్రామాన ఏవిదంగా బలంగా ఉందో అదేవిదంగా గ్రామాల్లో పర్యటించి గ్రామ కమిటీలను వేసి కాంగ్రెస్‌పార్టీని క్రింద స్థాయి నుండి పటిష్టవంతం చేస్తానని తెలిపారు. తన పై నమ్మకంతో తనను రెండవసారి టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకుగాను కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీకి,యువ నాయకులు రాహుల్‌గాంధీకి. ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గె లకు కృతజ్ఞతలు తెలియజేస్తు తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి తెలిపారు

### భగవాన్ బుద్ధ ఫెలోషిప్ అవార్డు అందుకున్న వైద్యనాథ్





అవార్డు- అందుకుంటున్న వైద్యనాథ్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** ఆదివారం ఢిల్లీలో సంగారెడ్డి జిల్లా టిజివో స్వచ్ఛంద సేవకుడు, వ్యవసాయ అధికారి డాక్టర్ డి వైద్యనాథ్‌కు భగవాన్ బుద్ధ జాతీయ ఫెలోషిప్-2022 ను భారతీయ దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ సమనాక్షర్ చేతులమీదుగా తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ ఆర్గనైజర్ జితేందర్ మను తదితరులు ఉన్నారు. బహుజన సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ వైద్యనాథ్ విస్తృతంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుంటారని అనాథలు, వృద్ధులకు చేయూ తనివ్వడంతోపాటు కరోనా విపత్కార పరిస్థితుల్లో సామాజిక బాధ్యతగా ముందుకువచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టినందుకుగానూ ఈ అవార్డు ఢిల్లీల్లో అందజేశారు.

### గుమ్మడిదల నూతన మండల అధ్యక్షురాలికి శుభాకాంక్షలు

**గుమ్మడిదల, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బొంతపల్లి అయ్యప్ప సన్నిదానంలో నూతన గుమ్మడిదల మండల మొదటి అధ్యక్షురాలు సద్ది ప్రవీణవిజయభాస్కర్‌రెడ్డికి నాయకులు, గ్రామస్థులు, వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంతపల్లి ఎంపీటీసీ సురభినాగేంద్ర గౌడ్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, టిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో డిసెంబర్ 13 నుండి 16 వరకు జరిగే జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఆదివారం నాడు ఉదయం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 2 కె రన్ అంబేద్కర్ గ్రౌండ్‌నుండి న్యూ బస్టాండ్ వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాంలో మాజీ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అతిమేల మాణిక్యం మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభలు ప్రధానంగా విద్యార్థులు విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం కోసం ఉద్యమాల గడ్డ ఓయూ యూనివర్సిటీలో జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రమ్య, ఉపాధ్యాయులు ఎర్రోళ్ల మహేష్, పాండు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శిలు శివ, సుభాష్, కృష్ణ, దత్తు విద్యార్థులు పాల్గొన్నారు.





సంగారెడ్డిలో 2 కె రన్ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు

### దేశంలో ఎక్కడాలేని పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయి : కర్రె రమేష్

**రామాయంపేట, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** దేశంలో ఎక్కడా లేని పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నాయని టీఆర్‌ఎస్వీ జిల్లా నాయకుడు, అంబేద్కర్ దళిత యువరత్న అవార్డు గ్రహీత కర్రె రమేశ్ అన్నారు. ఆదివారం నాడు ఆయన మాట్లాడుతూ టీఆర్‌ఎస్ నుంచి బిఆర్‌ఎస్‌కు ఆవిర్భవించిన సందర్భంగా భారతదేశానికి మంచి రోజులు వచ్చాయని, విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని, ఆయన చేతిలో తెలంగాణ రాష్ట్రం ఏవిధంగా అభివృద్ధి చెందుతుందో అదే తరహాలో దేశం అభివృద్ధి చేసుకోవడానికి మంచి అవకాశం ఏర్పడిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పెన్షన్, ఒంటరి మహిళా పెన్షన్, వృద్దాప్య పెన్షన్, దివ్యాంగుల పెన్షన్, దళితుల అభివృద్ధికి దళిత బంధు ఇంకా అనేక పథకాలు రాష్ట్రంలో ప్రజలకు అద్భుతంగా అందుతుందని తెలిపారు. అదేవిధంగా అన్ని రాష్ట్రాలను సమానంగా అభివృద్ధి చేసుకోవడానికి బాటలు పడుతున్నాయని, భారత రాష్ట్ర సమితి ఆవిర్భవించడం దేశానికే శుభసూచకం అని చెప్పుకోవచ్చన్నారు. ఈ సంక్షేమ పథకాలు దేశంలో ఉన్న ప్రతి అట్టడుగు వర్గాలకు అందేవిధంగా అన్ని రాష్ట్రాలను సమానంగా అభివృద్ధి చేసుకోవడానికి బాటలువేస్తున్న భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

### మానసిక ఒత్తిడిలు తగ్గించుకోవడమే వాకర్స్ అసోసియేషన్ లక్ష్యం



వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** అరోగ్యమే మహాభాగ్యం అత్మీయత అనుబంధం పెంచుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిలు తగ్గించుకోవడం ప్రశాంత లక్ష్యంగా సిద్దిపేట పట్టణ కోమటిచెరువు వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతినిధులు ఆదివారం తెలిపారు. 2020లో వాకర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ అధ్వర్యంలో ప్రతి యేటా డాక్టర్ బి.అర్.అంబేద్కర్, పూలే, శివాజీ లాంటి మహానీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ అధ్వర్యంలో పలు సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు 2 కె రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**నూతన కార్యవర్గం**

అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షులుగా నాయిని జైపాల్, గౌరవాధ్యక్షులుగా బొమ్మల యాదగిరి, ఉపాధ్యక్షులుగా రమేష్, పీజీల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కుంబాల పద్మారెడ్డి, కోశాధికారిగా చుక్క చంద్రం, ప్రచార కార్యదర్శిగా విద్యాసాగర్, కార్యదర్శిగా బూర చంద్రంగౌడ్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఏడాదిపాటు పనిచేస్తుంది. కార్యక్రమంలో అర్గనైజింగ్ కమిటీ సభ్యులు మెరుగు యాదగిరి, మిద్దె రవి, కొండరాజు, కెమ్మసారం దుర్గయ్య పల్లె భాస్కర్, బాలకిషన్ పాల్గొన్నారు.

### అంగరంగ వైభవంగా స్వామి వారి కళ్యాణం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** జైశ్రీమన్నారాయణ శ్రీ రామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో పునర్వసు నక్షత్రం పురస్కరించుకొని శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా అదివారం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం చేసిన తర్వాత కళ్యాణ వేదికపై శ్రీ సీతా రామచంద్రస్వామి అలంకరించి విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యావాచ నం, యజ్ఞోపవీత ధారణ, మంగళాష్టకాలు, కన్యాదానం మంగల్య సూత్ర ధారణ, బ్రహ్మముడితో కళ్యాణ తంతు వైద్య కృష్ణమాచార్యుల వైదిక నిర్వ హణలో జరిగింది. రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో అన్నదాన వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో దుంది‌గళ్ల నాగరాజు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళులు

**కోహెడ, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అదివారం మున్నూరుకాపు సంఘం నియోజకవర్గ కన్వీనర్ గాజుల వెంకటేశ్వర్లు అధ్వర్యంలో స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న జయంతి సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అయన జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు ఖమ్మం వెంకటేశం, సీపీఐ నాయకులు ముంజ గోపిగౌడ్, బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వట్టిపల్లి పద్మారెడ్డి, టిఆర్‌ఎస్ నాయకులు దాసు, బిజెపి నాయకులు పిల్లి నర్సయ్య, గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్ యాదవ్, బొమ్మగాని శివకుమార్‌గౌడ్, చేపూరి తిరుపతి, గాజుల రవీందర్, కంది సత్యనారాయణరెడ్డి, సుంకరి రవి, వాసాల దేవేందర్, చేపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

# ట్రాలీ ఆటో బైక్ ఢీకొని యువకుడి మృతి

**పది మందికి గాయాలు**

**చిన్నచింతకుంట మూల మలుపు వద్ద ఘటన**



మృతి చెందిన యవకుడు అద్నాన్, బోల్తా పడిన ట్రాలీ ఆటో

**నర్సాపూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** ట్రాలీ ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో 10 మందికి గాయాలైన సంఘటన నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని చిన్నచింతకుంట స్టేజీ మూలమలుపు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం ...హైదరాబాద్ నగరంలోని జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన అద్నాన్(18), బస్వరాజ్, పవన్, అమర్, హరి తదితరులు రెండు బైక్‌లపై ఆదివారం ఉదయం ఏడుపాయల వనదుర్గామాతా దర్శనానికి వెళతున్నారని తెలిపారు. అదేవిదంగా రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామానికి చెందిన పెద్ద మల్లేషం, చిన్నమల్లేషం, గంగమణి, జ్యోతి, మల్లి కార్జున్, లక్ష్మి, రజిత తో పాటు15 మంది కలిసి ట్రాలీ ఆటో వాహనంలో నగరంలోని జగద్గిరిగుట్ట లో జరిగే తొట్టెల పంక్షన్ కు వెళ్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో చిన్నచింతకుంట స్టేజీ వద్ద గల మూల మలుపు వద్దకు రాగానే ట్రాలీ ఆటో బైక్‌లు ఢీ కొనగా ట్రాలీ ఆటో బోల్తా పడగా బైక్ క్రింద పడిపోయింది. ఈ ప్రమాద ఘటనలో అద్నాన్ (18) అక్కడికక్కడే మృతి చెందగా బస్వరాజ్ తో పాటు పెద్ద మల్లేషం, చిన్న మల్లేషం,గంగమణి, జ్యోతి, మల్లికార్జున్, రజిత, లక్ష్మిలకు గాయాలయ్యాయని తెలిపారు.

గాయాలైన వారిని నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చికిత్సనిమిత్తం తరి లించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసు కున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.



నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులో మృతి చెందిన ఆవు

## కరెంటు షాక్‌తో ఆవు మృతి

**పాపన్నపేట, డిసెంబరు 11, ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌కు గురై ఓ పాడి ఆవు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని నాగ్సాన్‌పల్లి శివారులో చోటు చేసుకుంది. ఆవు యజమాని కథనం ప్రకారం... ఆదివారం ఉదయం మేత కోసం నాగ్సాన్‌పల్లిగ్రామ శివారులో ఆవు మేత మేస్తూ ఉండగా విద్యుత్ నియంత్రిక వద్ద కంచె లేకపోవడంతో అటుగా వెళ్లిన మూగజీవికి కరెంటు షాట్ కొట్టింది. కరెంట్ షాట్‌లో ఆవు అక్కడికి అక్కడే మృత్యువాత పడింది. 50వేల రూపాయల విలువ గల ఆవు మృతి చెందడంతో ఆవు యజమాని కన్నీరు మున్నీరు అయ్యాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే తమ కుటుంబానికి జీవనోపాధి అందిస్తున్న ఆవు మృతి చెందిందని బాదితుడు విచారం వ్యక్తం చేవారు.

### కుకునూరుపల్లిలో పాడి గేదె...



మృతి చెందిన పాడిగేదె

**కొండపాక, డిసెంబర్ 11,ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి పాడి గేదె మృతి చెందిన సంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో అదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొంతం లింగయ్యకు చెందిన పాడిగేదేను కట్టెసి ఇంటికి వచ్చాడు, తిరిగి వెళ్లి చూసేసరికి పాడిగేదే మృతి చెందినట్లు అయన తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన లింగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని మాజీ సర్పంచ్ బొడపట్ల ఐలం యాదవ్ కోరారు. కరెంటు స్థంబానికి ఉన్న సపోట్ వైర్‌కు విద్యుత్ సరపరా జరిగి గేదే మృతి చెందినట్లు అయన వివరించారు.



### మాండుస్ ఎఫెక్ట్..
# నగరంలో చిరుజల్లులు

- మూడురోజులపాటు కురిసే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ సూచన

హైదరాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త: మాండస్ తుఫాన్ ప్రభావంతో భాగ్య నగరంలో ముసురుపుపట్టింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఓమోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి ట్యాంక్‌బండ్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, బషీర్‌బాగ్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్‌లతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు, బాటసారులు తడిసిపోయారు. అయితే మాండౌస్ తుఫాన్ ప్రభావంతో మరో మూడు రోజులపాటు తేలిక పాటినుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని.. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలోలో గాలులు తూర్పు ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్నాయని వాతావరణకేంద్ర సంచాలకులు తెలిపారు. శనివారం ఉదయమే తీవ్ర వాయుగుండం బలహీనపడి..సాయంత్రం వాయుగుండగా.. ఆదివారం ఉందయం ఐదున్నర గంటలకు ఆల్పపీడనంగా మారిందన్నారు. ప్రస్తుతం ఈఅల్పపీడనం బలంగా ఉందన్నాని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ముదిరాజ్‌లను బీసీ ఏలుగా మార్చాలని మంత్రికి వినతి



ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బిసి ఏలుగా మార్చాలని మంత్రి హారీష్‌రావ్‌కు వినతిపత్రం ఇస్తున్న మెపా రాష్ట్ర ప్రతినిధులు

నార్సింగి, డిసెంబర్ 11 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని ముదిరాజ్‌లను బిసి డి గ్రూప్ నుంచి బిసి ఏ గ్రూపులోకి మార్చాలని ముది రాజ్ ఎంప్లాయిన్ అండర్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ ముది రాజ్ పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హారీష్‌రావ్‌ను కలిసి తమ డిమాండ్ల ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, దేవేందర్‌లు మాట్లాడుతూ తరతరాలుగా నిరుపేద ముదిరాజ్‌లు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వెనుకబడి పోయారని, ఇలాంటి వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరినట్లు తెలిపారు. పేద ముదిరాజ్‌లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశామన్నారు. మా న్యాయమైన డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మయ్యేలా చూస్తానని హామీనిచ్చారని వివరించారు. మంత్రి హారీష్‌రావ్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో వేణుమాదవ్, చంద్రశేఖర్, మధుసూదన్, రమణ, మహేందర్, రాజు తదితరులు ఉన్నారు.

### ఎస్‌బీఐ కొంపల్లి శాఖలో
## అగ్నిప్రమాదం




అగ్నిప్రమాదంతో ఎస్‌బీఐ బ్యాంకులో పొగలు వెలువడుతున్న దృశ్యం

పేట్‌బషీరాబాద్, డిసెంబర్ 11 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఆదివారం ఉదయం 7గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ విషయంపై స్థానికులు పేట్‌బషీరాబాద్ పోలీసులు,అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని నిర్ధారణకు వచ్చారు.ఈ అగ్నిప్రమాదంలో ఫర్నిచర్, ఏసీలు, మిగతా వస్తువులు దగ్ధమవడంతో రూ.2లక్షల రూపాయల నష్టం జరిగింది. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నదుల ప్రత్యేకతపై ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త: మనదేశంలో 70శాతంమంది ప్రజలు వ్యవసాయంపై జీవిస్తున్నారు. వ్యవసాయానికి అవసరమైన నీరు మనకు నదుల నుంచే వస్తాయి. అలాంటి నదులను మనం కలుషితం కాకుండా కాపాడుకోవాలి. పాడిపంటలు సస్యశ్యామలంగా ఏవిధంగా చేయాలో విద్యార్థులకు కళ్లకుకట్టినట్లు చూపించిన "జలం-సలిలం"నృత్య ప్రదర్శన అందర్నీఆకట్టుకుంది. ఈమేరకు ఆదివారం ది క్రీక్ ప్లానెట్ స్కూల్ -వీనస్ క్యాంపస్ ఆవరణలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్ నేపథ్యంగా తీసుకుని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత నాయుడు అతిథులతో కలిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీరించి దీపప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం కేంద్ర నేర పరిశోధన విభాగ అధికారిణి పెద్దారెడ్డి సీతారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, నైతిక విలువలను పెంపొందిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో చైర్మన్ శీనయ్య, వైస్ చైర్మన్ పాండురం గాచారి, మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్ర, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలి

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 11, ప్రభాతవార్త : ప్రేమ, ఆత్మీయత అనురాగాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలని జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని రహ్మత్‌నగర్ ఎమ్‌జిఎన్ గ్రౌండ్‌లో హైదారాబాద్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం పరిదిలోని దాదాపు 15వేలమంది ప్రజలు ఈక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఏముఖ్యమంత్రి చేయని విధంగా అన్ని కులమతాలకు అతీతంగా పండుగలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.క్రిస్మస్ పండుగకు క్రిష్టియన్‌లకు బహుతులను రంజాన్ పండుగకు ముస్లిం పండుగలకు రంజాన్ పండుగకు సోఫా, బతుకమ్మ పండుగకు చీరలను అందజేశారని తెలిపారు. ఈక్రిస్మస్ వేడుకల్లో కనీవినీ ఎరుగని విధంగా ప్రతి ఒక్కరికి క్రిస్మస్ బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో జిహెచ్ఎమ్‌సి జోనల్ కమీషనర్ శంకరయ్య, డిఎమ్‌సి రమేస్, స్థానిక కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్, దేదిప్యరావు, సంగీత యాదవ్, విద్యాసాఫర్, ఏసుదాసు, నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు కోనేరు అజయ్, సంజీవ, మన్సూర్, సంతోష్, కృష్ణమోహన్, విజయ్‌సింహా తదితరులు పాల్గొన్నారు.

### సర్వాంగ సుందరంగా
# బొల్లారం రాష్ట్రపతి నిలయం

**శీతాకాల విడిదికి నగరానికి రానున్న దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము**





అల్వాల్, డిసెంబరు 11 ప్రభాతవార్త: దేశ ప్రథమ పౌరురాలికి ఆతిథ్యం ఇచ్చేందుకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ముస్తాబవుతోంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదిలో భాగంగా డిసెంబరు 28 నుంచి 30వ తేదీ వరకు రెండు రోజులు పాటు ఇక్కడ బస చేయన్నారు. ప్రతి ఏడాడి శీతాకాంలో రాష్ట్రపతులు దక్షిణాది పర్యటనలో బాగంగా బొల్లారం నుంచే దేశ పరిపాలనా బాధ్యతలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్రపతి నగరంతో పాటుగా ఇతర రాష్ట్రాలకు అధికార పర్యటనలకు ఇక్కడి నుంచే వెళ్తారు. తన పర్యటనలు ముగించుకుని మరలా రాష్ట్రపతిని నిలయానికి చేరుకుంటారు. ద్రౌపది ముర్ము మొదటిసారి రాష్ట్రపతి నిలయానికి వస్తున్నారు. దేశ మొట్టమొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ నుంచి అందరు రాష్ట్రపతులు బొల్లారం నిలయంలో బస చేసిన వారే. సర్వేపల్లి రాధాక్రిష్ణ, జాకీర్ హుస్సేన్, వెంకటగిరి, నీలం సంజీవ్‌రెడ్డి, రామస్వామి వెంకట్రామన్, శంకర్‌దయాళ్ శర్మ, అబ్దుల్ కలాం, ప్రతిభాపాటిల్ ప్రణభ్ ముఖర్జీ రాష్ట్రపతి నిలయంలో సేద తీరారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవనం తరువాత అదే స్థాయిలో ప్రతిష్టాత్మకమైన భవనం ఇదే. సిమ్లాలో రాష్ట్రపతి విడిది భవనం మరొకటి ఉంది. దక్షిణాది ప్రాంతం బొల్లారంలో మాత్రమే రాష్ట్రపతికి భవనం ఉండడం విశేషం. రెండు రోజులు పాటు దేశ పరిపాలన మొత్తం ఇక్కడి నుంచే కొనసాగనున్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదిక వసతులు కల్పించడంలో వివిధ విభాగాల అధికార యంత్రాంగం నిమగ్నమై ఉంది. జీహెచ్ఎంసీ, కంటోన్మెంట్ విభాగాలుతో పాటుగా పోలీసు, విద్యుత్, జలమండలి సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. భవనం చుట్టూ రక్షణ విభాగాలకు తోడు దట్టమైన చెట్లు చేమలు ఉండడంతో పాములు బెడద అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పాములు పట్టే వ్యక్తులతో పరిసరాలను జల్లెడ పడుతున్నారు. భద్రతా పరంగా ఇప్పటికే నగర పోలీసులు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం జరిగింది. రాష్ట్రపతి బస చేసే అన్ని రోజులు రక్షణ బాధ్యతలను స్థానిక పోలీసు యంత్రాంగం చేపడుతుంది.

**రాష్ట్రపతి నిలయం నేపథ్యం..** 1805లో అప్పటి బ్రిటీష్ అధికారులు నిర్మించిన ఈ భవనం వైస్రాయ్ అతిథి గృహంగా పిలిచేవారు. దీనికి అనుకుని తెలంగాణ ఆంధ్రా సబ్ ఏరియా ప్రధాన కార్యాలయం ఉండడంతో అక్కడికి వచ్చే అధికారులు వైస్రాయల్ అతిథి గృహంలో నివసించే వారు. స్వాతంత్ర్యం అనంతరం 1950లో ఈ భవనాన్ని భారత ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవడంతో రాష్ట్రపతి నిలయంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. రాష్ట్రపతి నిలయం 76 ఎకరాలులో విస్తరించి ఉంటుంది. మొత్తం భవనంలో 20 గదులు ఉన్నాయి. భవనం వెలుపల 20 గదులు రాష్ట్రపతి సిబ్బంది కోసం ఉంటాయి. మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ నుంచి దక్షిణాది పర్యటన ప్రారంభమైంది. జుల్తై, ఆగస్టు లేదా డిసెంబరు, జనవరి నెలల్లో రాష్ట్రపతులు ఇక్కడ పర్యటిస్తారు.

శతృదుర్భేధ్యం..
రాష్ట్రపతి భవనం పరిసరాలు పూర్తిగా రక్షణ విభాగాలు కొలువు తీరి ఉన్నాయి. ఒక పక్క తెలంగాణ ఆంధ్రా సబ్ ఏరియా ప్రధాన కార్యాలయం మరోవైపు ఎంసిఇఎంఇ, ఇఎంఇ, సిడిఎం తదితర ప్రతిష్టాత్మకమైన రక్షణ స్థావరాలు కవచాలుగా ఉంటాయి. చీమ చిటుక్కుమన్నా సైనికులు అప్రమత్తత ఇక్కడ సర్వసాధారణం. సాధారణ రోజులలో సామాన్య ప్రజానీకం రాకపోకలపై నిషేధాజ్ఞలు ఉంటాయి. సైనిక దళాలకు చెందిన సిబ్బంది వారి కుటుంబాలు రాకపోకలపై మాత్రమే అనుమతి ఉంటుంది. రాష్ట్రపతి ఉన్న రోజులులో సాధారణ పౌరులు రాకపోకలపై ఆంక్షలు ఉంటాయి.

### కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో
## ఘనంగా మహాపడి పూజ



పడిపూజా కార్యక్రమంలో పాల్గొన్న జి.కిషన్‌రెడ్డి, విజయశాంతి

సైఫాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త: నారాయణ గూడ లోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కళ శాలలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆది వారం ఉదయం శ్రీస్వామి అయప్ప మహాపడిపూజ కార్యక్రమం కన్నుల పండగా ఘనంగా జరిగింది. శాస్త్రోక్తంగా జరిగిన ఈ మహాపడి పూజా కార్యక్ర మంలో వేలాది మంది అయ్యప్పలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అయ్యప్పలు, భక్తులు పెద్ద ఎత్తున భక్తి గీతాలను ఆలపించారు. భజనలు చేపట్టారు. అనంతరం అయ్యప్పలకు బిక్ష, భక్తులకు (ప్రసాదం) పంపిణి, అన్నదానం జరిగింది. ఈ పూజలలో కిషన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి కావ్యారెడ్డి, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, ఎమెమ్మెల్యే ముఠా గోపాల్, బిజెపి నేతలు విజయశాంతి, ఇంద్రసేనారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, వివేక్ వెంకటస్వామి, గీతామూర్తి, రామచంద్రారావు, పొంగులేటి సుధా కర్‌రెడ్డి, రామన్‌గౌడ్, కార్పోరేటర్లు గడ్డం మహాలక్ష్మీరామన్‌గౌడ్, పద్మా వెంకట్‌రెడ్డి, అమృత, దేవర కరుణాకర్‌రెడ్డి పెద్దఎత్తున పాల్గొన్నారు. కాగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్‌అయి బిజెపిలో చేరిన మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డికూడా పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



చాకలి ఐలమ్మ విగ్రావావిష్కరణలో పాల్గొన్న కార్పోరేటర్ రోజాదేవి

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 11, ప్రభాత వార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కూకట్‌పల్లి గ్రామంలో గల ఈస్ట్ కమాన్ వద్ద కూకట్‌పల్లి రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వివేకానందనగర్ డివిజన్ కార్పోరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, మాజీ కార్పోరేటర్ రంగారావులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలను కొనియాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా స్త్రీలు అన్యాయాన్ని ఎదుర్కొనటానికి ఐలమ్మని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రజక సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా గోల్కొండ సాహిత్య ఉత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

చార్మినార్, డిసెంబరు 11 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ చార్‌కమాన్‌లోని అగర్వాల్ కళాశాలలో 75వ స్వాతంత్ర్య అమృత మహోత్సవాలలో భాగంగా భాగ్య నగర్ ఆదివారం సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోల్కొండ సాహిత్య ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.తెలంగాణ లోని పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, రచయితలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్.ఆనంద్ వర్మ,డాక్టర్ వంశీ తిలక్, డాక్టర్.ప్రశాంత్‌లు స్వాతంత్ర్య సంగ్రామం,హైదరాబాద్ నగరం విముక్తి,రజా కార్ల సమయంలో జరిగిన సంఘటనలు గురించి విపులంగా వివరించారు. గోల్కొండ సాహిత్య ఉత్సవాలు సందర్భంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు,షోయబు ల్లాఖాన్, డాక్టర్.బూర్గుల రామక్రిష్ణ, కుమరం భీమం, టంగుటూరి ప్రకాశం పంతులు,కవయిత్రి సరోజినీ నాయుడు, ఆచార్య ఎన్‌జి రంగా,మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు,స్వాతంత్ర సమర యోధులు వావిలాల గోపాలక్రిష్ణయ్య,దుర్గాభాయి దేశ్ ముఖ్, సురవరం ప్రతాప్‌రెడ్డి,పట్టాభి సాతారామయ్య, కాటం లక్ష్మీ నారాయణతో పాటు పలువురు దేశ భక్తులకు సంబంధించిన చిత్రాలు,వారి జీవిత విశేషాలు తెలియజేసే ఫోటోలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. గోల్కొండ సాహిత్య ఉత్సవాలు సందర్భంగా ప్రత్యేకంగా పలు రకాల హిందీ పుస్తకాలు,హైదరాబాద్ నగర విముక్తికి కవులు రాసిన పుస్తకాలను విక్రయించారు.నిజాం పాలనకు వ్యతిరేకంగా విద్యార్దులు ప్రదర్శించిన నాటకాలు ఎంతోగానో ఆకట్టుకు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ యుజిసి సభ్యులు,సమాచార భారతి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్.గోపాల్ రెడ్డి,ప్రొఫెసర్ జి.గోపాలరావు,పాతబస్తీకి చెందిన ఫంకజ్ కుమార్ అగర్వాల్, పారసాని వెంకటేష్ పాల్గొన్నారు.

# 13న ఛలో ఢిల్లీ.. పార్లమెంట్ ముట్టడి

**బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి : ఆర్.కృష్ణయ్య**



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య,గుజ్జకృష్ణ సంఘాల నాయకులు

హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త: జనాభా దామషా ప్రకారం 27శాతం నుంచి 50శాతానికి రిజర్వేషన్లు పెంచాలని పార్లమెంట్‌లోబిసి బిల్లుపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు ఆదివారం బిసిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి ఎస్సీ,ఎస్టీ, బిసి ఉద్యోగ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈసందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రిజర్వేషన్లపై కేంద్రం విధించిన గరిష్ట పరిమితి 50శాతంను సుప్రీంకోర్టు తొలగించిందుకు ఎలాంటి న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అవరోధాలు లేనందున, ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం రిజర్వేషన్లను 70శాతానికి, జార్ఖండ్ ప్రభుత్వం 71శాతంకు రిజర్వేషన్లు పెంచారన్నారు. 13న ఢిల్లీలో జరిగే ఆందోళనకు ఏపీ, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా,రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈసమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నీలం వెంకటేష్, సుధాకర్, నర్సింహ్మారావు, కిరణ్‌మాదిగ, గొల్లపల్లి దయానంద్, సైదులు, జి.అనంతయ్య, గండేటి శంకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం అన్నిమతాలను సమానంగా గౌరవిస్తుంది

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



క్రిస్టియన్ చర్చి ఫాదర్లతో సమావేశమైన మంత్రి తలసాని

కంటోన్మెంట్,డిసెంబర్ 11 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాలను, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. క్రిస్మస్ వేడుకల నిర్వాహన క్రిస్టియన్ మత పెద్దలతో ఆదివారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో నిర్వహించిన సమావేశంలో తలసాని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసిఆర్ ఆదేశాల మేరకు అన్ని పండగలను ఘనంగా జరుపుకునే విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసస్తుందని గుర్తు చేశారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 13వ తేదీన సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన అన్ని ప్రాంతాల్లో గిఫ్ట్ ప్యాకెట్లను అందజేయడంతో పాటు నియోజకవర్గంలోని 8 ప్రాంతాల్లో డిన్నర్ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం 12వ తేదీన క్రిస్టియన్ల భవన నిర్మాణం కోసం 2 కోట్ల రూపాయల వ్యయంతో రెండు ఎకరాల విస్తీర్ణంలో క్రిస్టియన్ భవనం నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కురుమ హేమలత, మహేశ్వరీ, మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, శేషుకుమారి, ఉప్పల తరుణి, డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు ముకుందరెడ్డి, మోహన్ రెడ్డి, క్రిస్టియన్ ప్రతినిధులు ప్రశాంత్, దయాకర్, జయరాజ్, సుదర్శన్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలను మోడల్ వైకుంఠ ధామాలుగా తీర్చిదిద్దాం

**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి**



సాయినగర్ స్మశాన వాటికలో సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, డిసెంబర్ 11 ప్రభాతవార్త: నగరంలో ఆయా ప్రాంతాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో స్మశాన వాటికలను మోడల్ వైకుంఠ దామాలుగా తీర్చిదిద్దడం జరిగిందని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాక డివిజన్ సాయినగర్‌లో బస్తీలోగల స్మశాన వాటికను డిప్యూటీ మేయర్, టీటీయూసీ రాష్ట్ర అద్యక్షుడు మోతె శోభన్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. అందులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లైట్లు, రోడ్డు, నీటి వసతి, అంత్యక్రియలు చేసేందుకు ఫ్లాట్‌ఫాంలను తీర్చిదిద్దాలని వారికి విజ్ఞప్తి చేశారు. అందుకు వారు స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలోని జూబ్లీహిల్స్ వైకుంఠ దామం మాదిరిగా ఆయా ప్రాంతాల్లో రూ.49.24 కోట్ల వ్యయంతో 34 అందు బాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ పనులను రానున్న వర్షాకాలంలోపు పూర్తి చేసేలా చూస్తామన్నారు. ముక్తి ఘాట్‌ను ఏర్పాటు చేసి రూ.16 కోట్లతో అన్ని కులాలు, మతాల వారు ఒకే చోట దహన సంస్కారాలు చేసుకునేలా ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు.

## రోడ్ సేఫ్టీ అవగాహనపై 2కె, 5కె రన్



హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త: వాహనాలు ఉపయోగిస్తూ రహదారి వాడుతున్న ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై తెలుసుకోవడం ముఖ్యం.. సెల్‌ఫోన్‌ల వినియోగం పెరగడం, వాహనాల వేగపరిమితలు పాటించకపోవడం చిన్నపిల్లలు రోడ్లు దాటడం వంటి కారణాల వల్ల ఇటీవల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై చిన్నారులు, పెద్దల్లో అవగాహన కల్పించేందుకు 2కే, 5కే రన్‌ను నిర్వహించారు. ఈరన్‌ను మాదాపూర్ ఎసిపి జి.హనుమంతరావు జెండా ఊపి ప్రారంభించగా డైరెక్టర్ మేఘనా జూపల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో ఇద్దరు నకిలీ వైద్యులు అరెస్ట్

చార్మినార్, డిసెంబరు 11 ప్రభాతవార్త : డాక్టర్ కోర్సుకు సంబంధించి ఎటువంటి సర్టిఫికెట్లు లేకుండ పేద ప్రజలను మోసం చేసి వైద్యం అందిస్తున్న ఇద్దరు నకిలీ వైద్యులను భవానీనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భవానీనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజాద్ అలీ కథనం ప్రకారం.. సైపుద్దీన్ (50) పదివ తరగతి ఉత్తీర్ణుడ్తయ్యాడు. డాక్టర్ కోర్సుకు సంబంధించి ఎటువంటి సర్టిఫికెట్లు లేకపోయినప్పటికి తలాబ్‌కట్టలో గత రెండు సంవత్సరాలు నుంచి క్లినిక్ నడుపుతున్నాడు.అదే విధంగా ఇంటర్మీడియట్ పాసై కొంతకాలం మేల్ నర్సుగా పని చేసిన మోజం (32) ఆరు నెలలుగా తలాబ్ కట్టలో కేజీఎన్ పేరుతో క్లినిక్‌ను నిర్వహిస్తున్నాడు. ఇద్దరు నకిలీ వైద్యులు వైద్య కోసం వచ్చే పేషెంట్లు నుంచి 50 రూపాయలు ఫీజు తీసుకుని వైద్యం అందిస్తున్నారు.డాక్టర్‌కు సంబంధించి ఎటువంటి అర్హతలు లేకుండానే దర్జాగా వైద్యులుగా చలామణి అవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరు నకిలీ వైద్యులైన సైపుద్దీన్, మోజంలను అదుపులోకీ తీసుకుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.